సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 1 । జూలై । 2025



రైల్వే టికెట్ ధరలు పెంపు
నేటి నుంచి స్వల్పంగా రైల్వే టికెట్ చార్జీలు పెంచుతున్నట్లు రైల్వే అధికారులు సోమవారం రాత్రి తెలిపారు.
- 8లో▸



లెక్కలన్నీ తేల్చుతారు..
ప్రతీ సంస్థకు సీఏ తప్పనిసరి. ఏడాదిలో చేసిన జమ, ఖర్చులకు సంబంధించిన ప్రతీ పైసా లెక్క తేల్చుతారు. నేడు చార్టెర్డ్ అకౌంటెంట్ డే సందర్భంగా కథనం.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/24^0$

వాతావరణం
జిల్లాలో వాతావరణ మార్పుల కారణంగా తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. పలుచోట్ల సాధారణ పరిస్థితి ఉంటుంది.

వైద్యనేస్తం రుబీనా

వైద్యచికిత్సతోపాటు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న 'వంగర' వైద్యురాలు

- పలు గ్రామాల్లో సదస్సుల నిర్వహణ..
- ఆరోగ్యకేంద్రంలో సొంతంగా ఆరోగ్య పుస్తకాలతో లైబ్రరీ ఏర్పాటు
- ఆస్పత్రికి వచ్చే మహిళలు, గర్భిణులతో పుస్తక పఠనం..

నేడు జాతీయ వైద్యుల దినోత్సవం




నవజాత శిశువుతో డాక్టర్ రుబీనా (ఫైల్)

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పీహెచ్‌సీ నిత్యం గర్భిణులు, మహిళలు, రోగులతో నిండిపోయి ఉంటుంది. ఇక్కడ వైద్యం కోసం వారంతా గంటల తరబడి ఎదురుచూస్తుంటారు. అందుకు కారణం అక్కడి వైద్యురాలు రుబీనా. ఆమె కేవలం చికిత్సలు అందించడమే కాకుండా జబ్బు రావడానికి కారణాలు. ఎలా చేస్తే ఆరోగ్యంగా ఉండగలం అని రోగులకు విడమర్చి చెబుతున్నారు. పేదల కష్టాలను దగ్గర్నుంచి చూశారు. వారి జబ్బులకు కారణం తెలుసుకున్నారు. వారి ఆర్థిక వెనుకబాటుకు అనారోగ్యమే కారణమని గ్రహించారు. ఆరోగ్యం అందరి ప్రాథమిక హక్కు అని చెప్పాలనుకున్నారు. అందుకే ఆమె డాక్టరయ్యారు. అనారోగ్యంతో వచ్చిన రోగికి వైద్యమందించడమే కాదు.. వారికి అవగాహన కల్పిస్తే మరోసారి అనారోగ్యం బారిన పడరని అవగాహన కల్పించడం మొదలు పెట్టారు.ఇందు కోసం సొంతఖర్చులతో లైబ్రరీ ఏర్పాటుచేశారు. ఫలితంగా ఇప్పుడా ప్రభుత్వ వైద్యురాలి వద్దకు ప్రజలు క్యూ కడుతున్నారు. నేడు (మంగళవారం) నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా పేదల ఆరోగ్య నేస్తం వంగర పీహెచ్‌సీ వైద్యురాలు సయ్యద్ రుబీనాపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- సాక్షి, వరంగల్ డెస్క్

వంగర పీహెచ్‌సీలో వైద్యఆరోగ్య పుస్తకాలు చదువుతున్న మహిళలు, లైబ్రరీలోని పుస్తకాలు





ఆరోగ్య విద్య.. పుస్తక పఠనం

వంగర పీహెచ్‌సీ వైద్యురాలిగా చేరిన తర్వాత ఆస్పత్రికి వచ్చే రోగులకు, గర్భిణులకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధకనబర్చడం మొదలెట్టారు. సమీప గ్రామాల్లో క్యాంపులు పెట్టి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. టీబీ, షుగర్, బీపీ వంటి వ్యాధులపై వందల సంఖ్యలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య కార్యకర్తల ద్వారా గర్భం దాల్చిన మహిళల్ని కలిసి ప్రైవేట్‌కు వెళ్లకుండా పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకునేలా, ప్రసవం చేయించుకునేలా ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కల్పిస్తున్నారు. ఫలితంగా వంగర పీహెచ్‌సీకి రోజూ దాదాపు 70 నుంచి 100 మంది ఓపీ చూపించుకుంటున్నారు. డాక్టర్ కోసం వేచి ఉన్న సమయంలో పేషెంట్లతో పుస్తకాలు చదివిస్తున్నారు. ఇందుకోసం లైబ్రరీ ఏర్పాటుచేశారు. ఆమె సొంత ఖర్చులతో హెల్త్ గైడ్, హెల్త్ కేర్, ఆరోగ్య వ్యాయామ విద్య, ఆరోగ్య నిధి, ఆరోగ్య విజ్ఞాన శాస్త్రం, యోగా, వంటిల్లే వైద్యశాల వంటి పుస్తకాలను కొనుగోలు చేసి రోగులతో చదివిస్తున్నారు.



కేన్సర్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రుబీనా

అవగాహనే కొండంత అండ..

అనారోగ్యంతో వచ్చినవారికి మందులిచ్చి పంపించడం అందరూ చేస్తుంటారు. కానీ అనారోగ్యానికి కారణాలు. మరోసారి అలా చేయకుండా ఉండేందుకు జాగ్రత్తలు చెబితే ఆ వైద్యుల్ని ఎవరైనా మరిచిపోతారా? అచ్చం రుబీనా అదే పద్ధతి ఫాలో అవుతున్నారు. వచ్చిన వారికి తన పరిధిలో పూర్తి సాయం చేస్తున్నారు. ఒక ఇంట్లోని మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ ఇల్లంతా బాగుంటుందని ఆమె నమ్ముతారు. అందుకని ముఖ్యంగా మహిళా సంబంధిత అనారోగ్య సమస్యలపై ఎక్కువ ఫోకస్ చేస్తున్నారు. వారిని ఎడ్యుకేట్ చేస్తూ మందులిస్తున్నారు.

ప్రజల ఆరోగ్యమే నా కర్తవ్యం



ఉద్యోగాన్ని బాధ్యతగా భావిస్తున్నా. తెలంగాణ ఫార్మేషన్ డే రోజు టీబీ మీద, డ్రగ్స్ మీద పరేడ్ గ్రౌండ్‌లో మేం చేసిన స్కిట్‌కు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. అయితే వ్యాధులపై అవగాహన సాధారణంగా చెప్పకుండా స్కిట్ల ద్వారా, పాటల ద్వారా అవగాహన కల్పిస్తే ప్రజల్లోకి వెళ్తుందని నమ్ముతున్నా. ఇప్పుడు నా పీహెచ్‌సీ పరిధిలో 27,000 పాపులేషన్ ఉంది. వారు ఆరోగ్యంగా ఉండడమే నా కర్తవ్యం.

- రుబీనా, పీహెచ్‌సీ వైద్యురాలు, వంగర

న్యూస్‌రీల్

సీపీని కలిసిన ఏఎస్పీ



వరంగల్ క్రైం: వరంగల్ డివిజన్ నూతన ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శుభం ప్రకాశ్ సోమవారం పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. పేదలకు సత్వరమే న్యాయం అందించేలా కిందిస్థాయి అధికారులపై పర్యవేక్షణ ఉంచాలని ఏఎస్పీకి సూచించారు.

పరిశోధన కేంద్రంగా పింగిళి మహిళా కళాశాల

కేయూ క్యాంపస్: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలను రీసెర్చ్‌సెంటర్‌గా గుర్తించారు. ఈమేరకు హిస్టరీ విభాగం పరిశోధనకు పర్యవేక్షకులుగా ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, డాక్టర్ ఎల్.ఇందిరను నియమించినట్లు కేయూ సోషల్ సైన్స్ డీన్, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి.మనోహర్ సోమవారం వెల్లడించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ కోల శంకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి టికెట్ రిజర్వేషన్‌కు ఆధార్ తప్పనిసరి

కాజీపేట రూరల్: భారతీయ రైల్వే జూలై 1 నుంచి ట్రైన్ టికెట్ బుక్ చేసుకునేందుకు ఆధార్‌కార్డు తప్పనిసరి అని ఉత్తర్వులు జారీ చేసినట్లు సోమవారం రాత్రి స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. జూలై 1 నుంచి ఆన్‌లైన్ టికెట్ విధానంలో, జూలై 15 నుంచి రైల్వే రిజర్వేషన్ కౌంటర్లలో టికెట్ రిజర్వేషన్ చేసుకునే వారు తప్పకుండా ఆధార్ జత చేయాలని పేర్కొన్నారు. వారి ఫోన్ నంబర్ కూడా ఆధార్‌కు లింక్ అయ్యి ఉండాలని రైల్వే శాఖ ఉత్తర్వులు అమలు చేసినట్లు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ ప్రత్యేక పీపీ



వరంగల్ లీగల్: హనుమకొండ జిల్లా ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్‌గా నియమితులైన ఎడవల్లి సత్యనారాయణ సోమవారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పీపీ నర్సింహారావు, ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కమ్ లేబర్ కోర్టు అదనపు ప్రభుత్వ ప్లీడర్ నూకల వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు తూమాటి దొణప్ప శతజయంత్యుత్సవాలు

హన్మకొండ కల్చరల్: ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి కమిటీ, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు విశ్వవిద్యాలయం తొలి ఉపాధ్యక్షులు దొణప్ప శతజయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న తెలిపారు జిల్లా కవులు, సాహితీవేత్తలు పాల్గొనవలసిందిగా కోరారు.

వెల్లువెత్తిన వినతులు

కిటకిటలాడిన గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్

- పరిష్కారం చూపకపోతే ఎందుకు స్వీకరిస్తున్నారని ఆందోళన
- దరఖాస్తులను స్వీకరించిన కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, వింగ్ అధికారులు





వినతి పత్రాలు స్వీకరిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, వింగ్ అధికారులు, మడికొండ మా హిల్స్ కాలనీలో రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

వరంగల్ అర్బన్ : 'మా సమస్యలు అంటే బల్దియా అధికారులకు, సిబ్బందికి చులకనైంది'అని పలు కాలనీల ప్రజలు సోమవారం గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నా పరిష్కారం కావడం లేదని, ఈ వినతుల స్వీకరణ ఎందుకు? అంటూ నిరసన వ్యక్తం చేశారు. భారీగా చేరుకున్న ఫిర్యాదుదారులతో బల్దియా కార్యాలయం అంతా కిక్కిరిసిపోయింది. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, వింగ్ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, ప్రతీ వినతిపై వివరణాత్మక నివేదిక అందించాలని కమిషనర్.. అధికారులకు సూచించారు. జవాబుదారీగా ఉండాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌సెల్‌కు మొత్తం 109 ఫిర్యాదులు రాగా, అందులో ఇంజనీరింగ్ సెక్షన్‌కు 26, హెల్త్ – శానిటేషన్ 14, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)13, టౌన్ ప్లానింగ్ 49, మంచినీటి సరఫరా 6, హార్టికల్చర్ 1 నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ జోనా, సీఎంహెచ్‌ఓ డా.రాజారెడ్డి, డీఎఫ్‌ఓ శంకర్ లింగం, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ మహేందర్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్‌ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఎంహెచ్‌ఓ డా.రాజేశ్, హెచ్‌ఓ రమేశ్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- వరంగల్ పాతబీట్ బజార్‌లో వర్షపునీరు, మురుగు నీటితో పాదచారులు, వ్యాపారులు, కార్మికులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారం చూపించాలని వ్యాపారులు కోరారు.
- మడికొండ మా హిల్స్ కాలనీలో ప్రభుత్వ రహదారిని ఆక్రమించి చేపట్టిన పనులు వెంటనే నిలిపేసి, చర్యలు తీసుకోవాలని సుమారు 60 మంది కాలనీవాసులు బల్దియా ఎదుట నిరసన వ్యక్తం చేసి, వినతిపత్రం అందజేశారు.
- రంగశాయిపేట 19-1-146 పాడుబడిన భవనం, సమీపంలోని ఖాళీ స్థలాల్లో చెట్లు, చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ డాక్టర్స్ కాలనీ హనుమాన్ నగర్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరైనా పట్టించుకోడం లేదని, తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు చేయాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.
- దేశాయిపేట సర్వేనంబర్ 326లో 20 గుంటల స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు.
- 45వ డివిజన్ కుమ్మరిగూడెం బల్దియా 13వ ఫైనాన్స్ నిధులతో సీసీ రోడ్డు నిర్మించారని, 2 ఫీట్లు పగులగొట్టి పైపులైన్ వేశారని, ఆ స్థలాన్ని సమీప ఇళ్లవాసులు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలన్ని విన్నవించారు.
- రంగశాయిపేటలో ఖాళీ స్థలాల్లో దోమలు వృద్ధి చెందుతున్నాయని, విషజ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ అశోక కాలనీలో సెల్ టవర్‌కు అనుమతులు రద్దు చేయాలని కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు విన్నవించారు.
- కాజీపేట కడిపికొండ బ్రిడ్జికి ఎదురుగా గల్లీలో డ్రెయినేజీ నీరు రోడ్డుపై పారుతోందని, చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విన్నవించారు.
- గోపాలపురం అరుణోదయ కాలనీలో హై టెన్షన్ వైర్ల కింద భవన నిర్మాణం చేపడుతున్నారని, గతేడాది ఓ వ్యక్తి మృతి చెందాడని నిబంధన మేరకు నిర్మాణం చేపట్టడం లేదని, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.
- రంగశాయిపేట శంభునిపేట జంక్షన్‌లో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.
- 31వ డివిజన్ హంటర్ రోడ్డు హిల్స్‌లో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు వినతి పత్రం అందించారు.
- 2వ డివిజన్ రెడ్డికాలనీలో 33 ఫీట్ల రోడ్డు ఉందని, కొలతలను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్నట్లు, నిబంధనల మేర చేపట్టాలని కాలనీవాసులు విన్నవించారు.
- భీమారం శ్యామల చెరువు మత్తడి 33 ఫీట్ల మేరకు ఉండగా, చాలావరకు కబ్జాకు గురైందని, వర్షం వస్తే ఇళ్లల్లోకి నీళ్లు వస్తున్నాయని, ఆక్రమణలను తొలగించాలని కాలనీవాసులు కోరారు.
- 65వ డివిజన్ ఎల్లాపూర్‌లోని ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి ఇష్టారాజ్యంగా భవనాలను నిర్మిస్తునారని, చర్యలు తీసుకోవాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు.
- 48వ డివిజన్ దర్గా కాజీపేటలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన కారు షెడ్డును తొలగించాలని కాలనీవాసులు విన్నవించారు.
- న్యూశాయంపేటలో బీజేపీ ఆఫీస్ వెనుక సీసీ రోడ్లు, డ్రెయినేజీలు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు వినతిపత్రం అందించారు.
- హనుమకొండ కాంగ్రెస్ భవన్‌నుంచి బుద్ధభవన్‌కు వెళ్లే దారిలో డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు కోరారు.

వినతుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో అధికారులు జాప్యం చెయొద్దని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ నేరుగా పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ప్రజావాణి వినతుల్ని త్వరగా పరిష్కరించుకోవాలని, వచ్చిన వినతులపై తక్షణమే చర్యలు చేపట్టాలని జిల్లాలోని పలువురు తహసీల్దార్లను వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు మొత్తం 176 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్, ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి..

వరంగల్ కలెక్టర్ సత్యశారద



వినతులు స్వీకరిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 130 వినతులు రాగా.. దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

వరంగల్‌లోని 13వ డివిజన్ దేశాయిపేట సీకేఎం కళాశాల గ్రౌండ్‌ను ఆనుకుని 2 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాలి.

– జన్ను అనిల్‌కుమార్, వరంగల్

కమర్షియల్ యూజర్ చార్జీలపై నిర్లక్ష్యమెందుకు?

- సీరియస్‌గా ఫోకస్ పెట్టండి
- అధికారులకు వార్నింగ్ ఇచ్చిన బల్దియా కమిషనర్

సాక్షి ఎఫెక్ట్

వరంగల్ అర్బన్: నగరంలో కమర్షియల్ యూజర్ చార్జీల విధింపులు, వసూళ్లపై ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ.. గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులకు సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'మామూళ్ల మత్తు' వార్తకు స్పందించిన కమిషనర్ ఉదయమే బల్దియా వింగ్ అధికారుల వాట్సాప్ గ్రూప్‌లో వార్త క్లిప్పింగ్‌ను షేర్ చేశారు. అనంతరం బల్దియా సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, హెచ్‌ఓ రాజేశ్‌తో కమిషనర్ సమావేశమయ్యారు. నగరంలోని వాణిజ్య సంస్థలు, వసూలు చేస్తున్న యూజర్ చార్జీలు, పరిధిలోకి రాని సంస్థలపై వివరణ అడిగారు. ఈసందర్భంగా కమిషనర్ పలు సూచనలిచ్చారు. త్వరితగతిన యూజర్ చార్జీల పరిధిలోకి వచ్చే వాణిజ్య సంస్థలన్నింటినీ గుర్తించి చార్జీలు వసూలు చేయాలన్నారు. ప్రతి నెలా వసూలు చేయాలని ఆదేశించారు. అదే విధంగా ప్రతీ సంస్థ నుంచి చెత్తను విధిగా వాహనాల్లో సేకరించి తరలించాలని ఆదేశించారు. ఈవిషయంలో ఏమాత్రం జాప్యం చేయవద్దని కమిషనర్ హెచ్చరించారు.

ప్రతీ పేదోడికి సొంతిల్లు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

హన్మకొండ/హన్మకొండ చౌరస్తా: ప్రతీ పేదోడికి సొంతిల్లు నిర్మించి ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 800 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రొసీడింగ్స్ అందించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు కాగా.. ఇప్పటివరకు 2 వేల మందికి ప్రొసీడింగ్స్ అందించామన్నారు. త్వరలో 1,500 మందికి ప్రొసీడింగ్స్ అందించనున్నట్లు చెప్పారు. ఇళ్ల మంజూరు కోసం ఎవరికైనా లంచం ఇస్తే ఇళ్లు రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్, హౌసింగ్ కార్పొరేషన్ పీడీ సిద్ధార్థ నాయక్, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, విజయశ్రీ రజాలీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా కేంద్రం కులగణన..

తెలంగాణ రాష్ట్ర సర్కారును ఆదర్శంగా తీసుకుని కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 4వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే గ్రామస్థాయి కార్యకర్తల సమ్మేళనానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వస్తున్నారన్నారు. సభకు గ్రామ, మండల, జిల్లా స్థాయి నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. పీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు దుద్దిళ్ల శ్రీనివాస్, పల్లె శ్రీనివాస్‌గౌడ్, మొత్కూరి ధర్మారావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, వీసం సురేందర్‌రెడ్డి, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బస్సులకు వరద కష్టాలు..

ఈఫొటో చూస్తే ఏదో కుంటలోనుంచి బస్సు వెళ్తుందనుకుంటున్నారా.. కాదండోయ్.. ఇది మన హనుమకొండ బస్‌స్టేషన్. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఇలా బస్‌స్టేషన్ ఆవరణలో నీరు నిలిచింది. ఇక్కడ డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక వర్షపునీరు వెళ్లేదారి లేక ఇలా నిలిచిపోతోంది. ప్రతీ వర్షాకాలం పరిస్థితి ఇలాగే ఉంటున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. **- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ**

ముగిసిన రిజిస్ట్రేషన్ గడువు

- పీహెచ్‌డీ పట్టాలకు 370మంది అభ్యర్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం ఈనెల 7న ఆడిటోరియంలో జరగనున్న విషయం తెలిసిందే. వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ పట్టాలు పొందేందుకు రిజిస్ట్రేషన్‌కు సోమవారం గడువు ముగిసింది. 370 మంది అభ్యర్థులు పీహెచ్‌డీ పట్టాలు పొందేందుకు ఒక్కొక్కరు రూ.వెయ్యి చొప్పున ఫీజు చెల్లించారు. అభ్యర్థులందరూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా పట్టాలు అందుకోవాలనే ఆకాంక్ష ఉన్నా.. ఆయన ఎంత సమయం ఇస్తారనేది తెలియాల్సి ఉంది.

ఆరు రోజులే..

స్నాతకోత్సవాన్ని క్యాంపస్‌లోని ఆడిటోరియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే 11 కమిటీలు వేశారు. ఆరు రోజులే సమయం ఉండడంతో ఆయా కమిటీలు తమకు అప్పగించిన బాధ్యతలపై దృష్టిసారించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇచ్చే సమయాన్ని బట్టి ఆయా అభ్యర్థులందకీ పట్టాలు ప్రదానం చేసేలా ముందస్తుగా ఆడిటోరియంలో సోమవారం రిహార్సల్స్ చేపట్టారు. వేదిక పైకి ఒకేసారి బ్యాచ్‌లవారీగా పిలిచి పట్టాలు ప్రదానం చేసినట్లుగా రిహార్సల్స్ చేశారు. ఒక్కో అభ్యర్థికి ఎంత సమయం పడుతుందో చూశారు.

గోల్డ్‌మెడల్స్ ముందుగానే అందజేత

గోల్డ్‌మెడల్స్ పొందే అభ్యర్థులు 2016నుంచి 2021వరకు 373మంది ఉన్నారు. వీరికి 564 గోల్డ్ మెడల్స్ అందించనున్నారు. అందులో కొందరు 2, మూడు, నాలుగు, ఐదు కూడా పొందేవారు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి ఇవ్వడం సాధ్యం కాదని, అందరినీ కలిపి 19 బ్యాచ్‌లు చేశారు. వీరికి యూనివర్సిటీ అధికారులు ఒకరోజు ముందుగానీ, లేదా అదేరోజు స్నాతకోత్సవం కంటే ముందుగానే కౌంటర్లు ఏర్పాటుచేసి మెడల్స్ అందజేస్తారు. పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం అయిపోయాక వీరిని బ్యాచ్‌లవారీగా వేదికమీదకి పిలిచి గవర్నర్ జిష్ణుదేవవర్మతో ఫొటోలు దిగాల్సింటుంది.

క్లుప్తంగా

అక్టోబర్‌లో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



నయీంనగర్: వరంగల్‌లో అక్టోబర్ నెలలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వరంగల్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెఆర్.దివ్యజ రాజ్ తెలిపారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో వరంగల్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ నూతన కార్యవర్గం ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా దివ్యజ రాజ్ మాట్లాడుతూ వరంగల్ క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణతోపాటు రాష్ట, జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందజేస్తామన్నారు. క్రీడాకారులకు క్రీడాసామగ్రి, క్రీడా దుస్తులు ఇస్తామన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు పారితోషికం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీపాద శ్రీనివాసరావు, ట్రెజరర్ డాక్టర్ ఎస్.నూతన్, మెడ్ల సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని ఆందోళన



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో 2021–2022 పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇచ్చి అప్పటికే అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించిన విషయం విధితమే. అయితే తమకు పీహెచ్‌డీలో అడ్మిషన్లు కల్పిస్తామని గతంలో చెప్పారని, ఉన్నత విద్యామండలి నుంచి సిఫార్సు చేసినా అడ్మిషన్లు కల్పించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ ఐదుగురు అభ్యర్థులు సోమవారం వీసీ చాంబర్‌లో ఆందోళన చేపట్టారు. వీసీ ప్రతాప్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. ఆందోళన చేసిన వారిలో మంద నరేశ్, బొట్ల మనోహర్, మోతే రాజు, ఎస్. అనిల్, తిరుపతినాయక్ ఉన్నారు.







పల్లె డాక్టర్ ప్రణీత్‌కుమార్





బురదరోడ్డులో నడుచుకుంటూ కొండాయి వెళ్తున్న ప్రణీత్‌కుమార్(ఫైల్)

ఏటూరునాగారం: ఆ గ్రామానికి వెళ్లాలంటే వాగు దాటాలి. రోడ్డు సరిగ్గా ఉండదు. అక్కడున్న వారికి ఆరోగ్యాన్ని అందించేందుకు డాక్టర్ ప్రణీత్‌కుమార్ సేవలందిస్తున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి పల్లె దవాఖాన వైద్యుడు హనుమకొండ ప్రణీత్‌కుమార్ కొండాయి సబ్‌సెంటర్ (పల్లెదావఖాన)లో పని చేస్తున్నారు. ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటూ వారికి ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా.. వెంటనే స్పందిస్తున్నారు. గొత్తికోయగూడెల్లోకి సైతం నడుచుకుంటూ వెళ్లి వైద్యం అందిస్తున్నారు. గూడెల్లోని ప్రజల మన్ననలు పొందుతున్నాడు.



గుట్టలెక్కి.. వైద్యం చేసి



చికిత్స అందిస్తున్న వైద్యాధికారి మధుకర్ (ఫైల్)


వాజేడు: గుట్టలపై ఉన్న పెనుగోలు గ్రామానికి వెళ్లి ఆదివాసీలకు వైద్యం చేయడం మధురానుభూతినిస్తుందంటున్నారు వాజేడు వైద్యాధికారి మధుకర్. ఏడాది క్రితం వాజేడు వైద్యాధికారిగా వచ్చిన తొలి రోజుల్లో సిబ్బందితో కలిసి మండల పరిధి కొంగాల గ్రామ పంచాయతీ గుట్టలపై పెనుగోలు గ్రామానికి కాలినడకన వెళ్లారు. వాగులు వంకలు దాటుతూ అప్ అండ్ డౌన్ 34 కిలో మీటర్ల నడిచారు. మారుమూల గ్రామాల ప్రజలకు సైతం ప్రభుత్వ వైద్యం అందాలని, వారికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు మధుకర్ చెబుతున్నారు.



గిరిజనులతో వైద్యాధికారి, సిబ్బంది (ఫైల్)

లెక్కలన్నీ తేల్చుతారు ..

- విశ్వసనీయతకు నిలువుటద్దం
- వ్యాపారుల లెక్కలన్నీ వీరి గుప్పిట్లోనే..
- సీఏ కోర్సుతో ఉన్నత అవకాశాలు



హన్మకొండ చౌరస్తా: ఏడాదిలో చేసిన లక్షలు, కోట్ల రూపాయల ఖర్చు, జమలకు సంబంధించిన ప్రతీ పైసా లెక్క తేల్చుతారు. బడా వ్యాపారుల నుంచి మొదలు.. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోనూ వీరిదే ముఖ్య భూమిక. లాభాల నుంచి నష్టాల వరకు ప్రతి అంశానికి ఓ లెక్క.. ఆ లెక్కకు ఓ రికార్డును సరిచేస్తారు. వారు లేనిది ఎంత పెద్ద సంస్థ అయినా నడవదంటే అతిశయోక్తి కాదు. ఇంతకీ వారు ఎవరు అనుకుంటున్నారా.. చార్టెడ్ అకౌంటెంట్లు. ప్రస్తుతం ప్రతీ సంస్థకు ఓ సీఏ తప్పనిసరి అయ్యింది. దీంతో సీఏ కోర్సుకు డిమాండ్ పెరిగింది. సీఏ పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలకు కొరత లేదనే చెప్పొచ్చు. నేడు చార్టెడ్ అకౌంటెంట్ల దినోత్సవ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఆర్థిక మోసాలను కనిపెట్టడంలో దిట్ట..

కంపెనీ ప్రాజెక్టు నివేదికలు తయారుచేయడం.. ఖర్చులు నియంత్రించడం.. ఆర్థిక మోసాలను కనిపెట్టి వాటి నివారణకు చర్యలు సూచించడం సీఏ బాధ్యత. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వారు ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 250 మంది చార్టెడ్ అకౌంటెంట్లు ఉన్నారు.

పెరుగుతున్న ఆదరణ..

సీఏగా గుర్తింపు పొందిన వారికి దేశంలోనే కాదు విదేశాల్లోనూ విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. మల్టీనేషనల్ కంపెనీల్లో పనిచేసే సీఏకు రూ.లక్షల్లో వేతనాలు చెల్లిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

సీఏ కోర్సు వివరాలు ..

ఇంటర్మీడియట్ పూర్తయ్యాక సీఏ ఫౌండేషన్‌కు రిజిస్టర్డ్ అవ్వాలి. డిగ్రీ పూర్తి చేసిన వారు ఫౌండేషన్ అవసరం లేకుండానే నేరుగా సీఏకు రిజిస్టర్డ్ కావొచ్చు. అడ్మిషన్ కోసం ముందు ఐసీఏఐ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయాలి. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి, అవసరమైన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి. సీఏ ఫౌండేషన్ ఇంటర్ తర్వాత మొదటి స్టేజీలో అకౌంటింగ్, 'లా', ఎకనామిక్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ఇలా నాలుగు సబ్జెక్టులు ఉంటాయి. 2 నుంచి 3 సంవత్సరాల ట్రైనింగ్ చేయాల్సి ఉంటుంది. చివరి స్టేజీలో రెండు గ్రూప్స్, ఆరు పేపర్లు పూర్తి చేయాలి. కోర్సు పూర్తయ్యే వరకు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అయితే ఐసీఏఐ ద్వారా మెరిట్, నీడ్ బేస్డ్ స్కాలర్‌షిప్స్ అందుతాయి. కోర్సు పూర్తి చేయడానికి 4–5 సంవత్సరాలు పడుతుంది.

అద్దె భవనంలో ..

దశాబ్ద కాలంగా హనుమకొండ హంటర్‌రోడ్ లోని ట్యాక్స్ బార్ అసోసియేషన్ భవనంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) వరంగల్ శాఖ అద్దె భవనంలో కొనసాగుతోంది. అప్పట్లో జిల్లాకు ఐసీఏఐకు సొంత భవనం మంజూరు చేయాలని అసోసియేషన్ బాధ్యులు అప్పటి కలెక్టర్ వాకాటి కరుణను కోరారు. స్పందించిన ఆమె బాలసముద్రంలోని ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీస్ పక్కన గల సుమారు ఎకరం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించేందుకు సూచనప్రాయంగా అంగీకారం తెలిపారు. అందుకు ప్రభుత్వ ధర ప్రకారం ఆయా స్థలానికి చెల్లించేందుకు ఐసీఏఐ సైతం ముందుకొచ్చింది. అంతేకాదు భవన నిర్మాణం కోసం రూ.6 కోట్లు వెచ్చించేందుకు ఐసీఏఐ రెడీగా ఉన్నట్లు తెలిపారు. ఇంతలో ఏమైందో తెలియదు ఆ ప్రతిపాదనలు మూలకుపడ్డాయి. దీంతో సీఏ కోర్సు చదవడానికి సరైన వసతులు లేకపోవడంతో ఉమ్మడి వరంగల్ విద్యార్థులు హైదరాబాద్, చెన్నై లాంటి మహానగరాలకు వెళ్తున్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి



పది సంవత్సరాలుగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వరంగల్ శాఖ అద్దె భవనంలో కొనసాగుతోంది. గతంలో కలెక్టర్ వాకాటి కరుణ ఎకరం స్థలం కేటాయించేందుకు ముందుకొచ్చారు. అనివార్య కారణాలతో అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఐసీఏఐకు స్థలం కేటాయిస్తే అత్యాధునిక వసతులతో భవనం నిర్మించేందుకు జిల్లా సీనియర్ సీఏలు సిద్ధంగా ఉన్నారు.

– తిప్పర్తి రాఘవరెడ్డి, సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్

మెట్రోనగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు



సీఏ కోర్సు చదివేందుకు వరంగల్‌లో ఆధునిక వసతులు లేకపోవడంతో అనేక మంది విద్యార్థులు హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు లాంటి మెట్రో నగరాలకు వెళ్తున్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో ప్రభుత్వం స్థలం కేటాయిస్తే భవనం నిర్మించేందుకు ఐసీఏఐ సిద్ధంగా ఉంది. భవనం పూర్తయితే ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది.

– పూజారి సత్యనారాయణ, చైర్మన్, వరంగల్ శాఖ, ఐసీఏఐ

టీ–హబ్‌తో ఒప్పందంపై మంత్రిని కలిసిన వీసీ



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి కేయూ అభివృద్ధికి సంబంధించిన అంశాలను తీసుకెళ్లారు. ప్రధానంగా రాష్ట్రీయ ఉన్నత విద్య అభియాన్ (రూసా) నిధులతో కేయూలో ఏర్పాటుచేసి కె-హబ్ గురించి మంత్రికి వివరించారు. యువతలో నూతన ఆవిష్కరణలు, ఇంక్యుబేషన్, అంకుర స్టార్టప్‌లను ప్రోత్సహించాలనే లక్ష్యం ఉందని వీసీ తెలిపారు. ఇంక్యుబేషన్, స్టార్టప్‌లను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్‌లోని టి-హబ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు సహకరించాలని మంత్రితో చర్చించారు. అలాగే, జియాలజీ విభాగానికి పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాన్ని ఏర్పాట చేయాలనే అంశంపై కూడా మంత్రి సానుకూలంగా స్పందించారని వీసీ తెలిపారు. ప్రత్యేకించి లైఫ్ సైన్సెస్ రంగంలో నూతన ఆవిష్కరణల కోసం కాకతీయ యూనివర్సిటీ కేంద్రంగా నిలవాలని మంత్రి కాంక్షించారని ప్రతాప్‌రెడ్డి సోమవారం సాయంత్రం క్యాంపస్‌లో వెల్లడించారు. వీసీ వెంట కేయూ జియాలజీ విభాగం అధిపతి ఆర్. మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.

దాతలారా.. ఆపన్నహస్తం అందించండి..

- రెండు కిడ్నీలు చెడిపోయి దీనావస్థలో బాధితుడు
- నిమ్స్‌లో 'జీవన్‌దాన్'కోసం దరఖాస్తు చేసుకున్నా ఫలితం శూన్యం



చికిత్స పొందుతున్న నవీన్‌కుమార్

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 36వ డివిజన్ పుప్పాలగుట్ట ప్రాంతానికి చెందిన వేల్పుల నవీన్‌కుమార్ (36) మూడేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయన రెండు కిడ్నీలు పూర్తిగా చెడిపోవడంతో మంచంపై కదల్లేని స్థితిలో దీనావస్థలో జీవితం సాగిస్తున్నాడు. అతని భార్య కవిత మూగ, చెవిటికాగా, కూతురు నివేదిత ఉన్నారు. నవీన్‌కుమార్ స్థానికంగా కరెంటు స్విచ్ బోర్డుల తయారు చేసే కాంట్రాక్టర్ వద్ద రోజుకు రూ.300 దినసరి కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని కష్టంమీద పోషిస్తున్నాడు. మూడేళ్ల క్రితం అతడికి హైబీపీ రావడంతో రెండు కిడ్నీలు పూర్తిగా చెడిపోవడంతో ఇంటి దగ్గరే ఉంటున్నాడు. గతంలో వారానికి రెండు రోజులపాటు డయాలసిస్ చేయగా, ప్రస్తుతం పరిస్థితి విషమించడంతో హనుమకొండలోని విశ్వాస్ ఆస్పత్రిలో వారానికి మూడు సార్లు డయాలసిస్ జరుగుతోంది. ఇందు కోసం ప్రతీనెల రూ.2లక్షల మేర ఖర్చు అవుతుండంతో భరించలేని స్థితిలో నవీన్‌కుమార్ కుటుంబం ఉంది. చెడిపోయిన రెండు కిడ్నీల స్థానంలో ఓ కిడ్నీ అయినా ఏర్పాటు చేస్తే తన ప్రాణం నిలిచే అవకాశం ఉందని నవీన్‌కమార్ చెబుతున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో 'జీవన్‌దాన్' పథకం కింద కిడ్నీ మార్పిడి కోసం దరఖాస్తు చేసుకుని 8 నెలల అవుతున్నప్పటికీ కిడ్నీ దాతలు లభించడం లేదు. దాతలెవరైనా ఉంటే 99493 49660 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి సహాయం అందించాలని బాధితుడి తండ్రి రత్నం కోరుతున్నారు.

నేటినుంచి రైల్వే టికెట్ ధరలు స్వల్పంగా పెంపు

స్లీపర్, మేయిల్, ఏసీ, ఫస్ట్‌క్లాస్‌లకు..

కాజీపేట రూరల్: జూలై 1వ తేదీ నుంచి రైలు టికెట్‌పై కిలోమీటర్ల దూరంపై స్వల్పంగా టికెట్ చార్జీలు పెంచుతున్నట్లు రైల్వే అధికారులు సోమవారం రాత్రి తెలిపారు.

టికెట్ ధరలు పెంపు ఇలా..

సెకండ్‌క్లాస్ ఆర్డినరీ టికెట్‌పై 0 నుంచి 500 కి.మీ. వరకు ఎలాంటి పెంపు లేదు. 501 నుంచి 1,500 కి.మీ.వరకు రూ.5, 1,501 నుంచి 2,500 కి.మీ.వరకు రూ.10, 2,501 నుంచి 3,000 కి.మీ. వరకు రూ.15 పెంచినట్లు అధికారులు తెలిపారు. స్లీపర్ క్లాస్ ఆర్డినరీకి అరపైసా, ఫస్ట్‌క్లాస్ ఆర్డినరీ అరపైసా, సెకండ్‌క్లాస్ మేయిల్, ఎక్స్‌ప్రెస్‌కు ఒక పైసా, స్లీపర్‌క్లాస్ మేయిల్, ఎక్స్‌ప్రెస్ ఒక పైస, ఫస్ట్‌క్లాస్ మేయిల్, ఎక్స్‌ప్రెస్‌కు పైసా, ఏసి చైర్‌కార్ రెండు పైసలు, ఏసీ త్రీటైర్ రెండు పైసలు, ఏసీ టు టైర్ రెండు పైసలు, ఏసీ ఫస్ట్‌క్లాస్, సీఈ, ఈఏకు రెండు పైసలు పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు. సబర్బన్ సింగల్ జర్నీ, సీజన్ టికెట్ వారికి ఎలాంటి చార్జీలు పెంచలేదని రైల్వే అధికారులు తెలిపారు.

ఎంఏ తెలుగు ప్రవేశాలకు ఏడు వరకు గడువు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ హంటర్‌రోడ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి, జానపద గిరిజన విజ్ఞానపీఠంలో 2025–2026 సంవత్సరానికి ఆలస్య రుసుముతో ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు ప్రవేశానికి గత సోమవారం గడువు ముగిసింది. కాగా, విద్యార్థుల విజ్ఞప్తుల మేరకు ఆలస్య రుసుముతో ఈ నెల 7 వరకు గడువు పొడిగించినట్లు పీఠం పీఠాధిపతి గడ్డం వెంకన్న సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. వివరాలకు 99891 39136, 99892, 17299 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఎంఏ తెలుగు మూడో సెమిస్టర్ తరగతులు..

2024–2025 విద్యాసంవత్సరానికి సంబంధించి సెకండ్ ఇయర్ ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు మూడో సెమిస్టర్ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని పీఠాధిపతి వెంకన్న తెలిపారు. విద్యార్థులు తరగతులకు హాజరుకావాలన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణతో మహిళలు ఆర్థిక పురోగతిని సాధించాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకాంక్షించారు. స్వయం సహాయక సంఘ మహిళల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా మహిళలు మరింత ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, మెప్మా కో–ఆర్డినేటర్ రజితరాణి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

డీటీ రాజేశ్ ఖన్నా కన్నుమూత..

- ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి
- మృతుడి కుటుంబానికి కలెక్టర్ పరామర్శ



రాజేశ్‌ఖన్నా మృతదేహంపై పూలమాల వేస్తున్న కలెక్టర్ సత్యశారద

నల్లబెల్లి: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న నల్లబెల్లి డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) రాజేశ్ ఖన్నా (50) కన్నుమూశారు. సోమవారం తెల్లవారుజామున ఎంజీఎంలో మృతి చెందారు. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. హనుమకొండ ప్రశాంత్ నగర్‌కు చెందిన డిప్యూటీ తహసీల్దార్ అన్నబోయిన రాజేశ్‌కన్నా(50) ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యానికి గురికాగా పరీక్షించిన వైద్యులు రెండు కిడ్నీలు పని చేయడం లేదని నిర్ధారించారు. దీంతో భార్య రమాదేవి తన కిడ్నీ దానం చేసి భర్తను బతికించుకుంది. ఈ క్రమంలో వైద్యం కోసం అప్పు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. వైద్యుల సూచన మేరకు జాగ్రత్తలు పాటిస్తూ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతేడాది తండ్రి, రెండు నెలల క్రితం తమ్ముడు మృతి చెందాడు. ఈ క్రమంలో 20 రోజుల క్రితం డీటీ రాజేశ్ కన్నా ఊపిరితిత్తుల సమస్యతో తీవ్ర ఇబ్బంది పడడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భార్య, కూతురు బంగారు ఆభరణాలు అమ్మి సుమారు రూ.25 లక్షలతో చికిత్స చేయించారు. అయితే ఇంకా అదే ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు చేతిలో డబ్బులు లేవు. దీంతో డిశ్చార్జ్ చేసి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తామంటే ప్రస్తుతం చికిత్స పొందుతున్న ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు రూ.7 లక్షలు చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో దిక్కుతోచని స్థితిలో భార్య రమాదేవి విలపిస్తూ రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో తన గోడు వెల్లబోసుకుంది. దీంతో వారు ఆస్పత్రి యాజమాన్యంతో చర్చించి మెరుగైన వైద్యం అందించారు. ఐదు రోజుల క్రితం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నారు. కృత్రిమ శ్వాసతో కోలుకుంటున్న క్రమంలో ఆదివారం రాత్రి ఛాతీ నొప్పితో అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం నిమిత్తం ఎంజీఎం తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. డిప్యూటీ తహసీల్దార్ మృతితో నల్లబెల్లి మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, డీటీ రాజేశ్‌కన్నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి కలెక్టర్ పరామర్శ..

డిప్యూటీ తహసీల్దార్ మృతి సమాచారం తెలుసుకున్న కలెక్టర్ సత్యశారద.. రాజేశ్ ఖన్నా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.50 వేలు అందించారు. నివాళులర్పించిన వారిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి, తహసీల్దార్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాక రమేశ్, కలెక్టరేట్ ఏఓ విశ్వప్రసాద్, తహసీల్దార్లు ముప్పు కృష్ణ, నాగేశ్వరరావు, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు?

- ఫైనాన్స్ వ్యాపారి హత్య కేసు విచారణలో విస్తుపోయే నిజాలు



నవీన్‌కుమార్(ఫైల్)

కాజీపేట: కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో శుక్రవారం ఫైనాన్స్ వ్యాపారి త్రిపురాధి నవీన్‌కుమార్‌ను దారుణంగా హత్య చేసిన నిందితులు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నవీన్‌కుమార్‌ను చంపిన తర్వాత నిందితులు అతడి(నవీన్‌కుమార్) శరీరంపై ఉన్న బంగా ర ఆభరణాలను తీసుకుని వరంగల్ బట్టల బజారులోని ఓ జ్యువెల్లరీ షాపులో రూ.6 లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నిందితులు ఇద్దరు కాజీపేటలోని ఓ చిరువ్యాపారిని కలిసి తమ ఫోన్ పోయిందని చెప్పి మరొకరితో మాట్లాడినట్లు కేసు విచారణలో బయట పడింది. దీంతో నిందితుల కదలికలపై కన్నేసిన పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మృతుడు ఆ రోజు డబ్బుల వసూలు కోసం వచ్చి సదరు మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించడం వల్లే చంపినట్లు నిందితుడు ప్రవీణ్‌కుమార్ పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. నవీన్‌కుమార్‌ను చంపిన తర్వాత మృతదేహాన్ని మాయం చేసి ఏమి తెలియనట్లు ఉండాలని భావించామని, కానీ పరిస్థితులు అనుకూలించకపోవడంతో విషయం బహిర్గతం అయ్యిందని కన్నీరు పెట్టుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. డబ్బులు సాయం చేసిన వ్యాపారిని హత్య చేయాలనే ఉద్దేశం తమకు లేదని, అతడి ప్రవర్తన వల్లే మద్యం మత్తులో హత్య చేసినట్లు నిందితులు పోలీసు అధికారులకు చెబుతున్నట్లు తెలుస్తోంది. హత్య జరిగిన అనంతరం వరంగల్‌లో బంగారం విక్రయించగా వచ్చిన డబ్బులలో కొంత మేర బాకీలు చెల్లించి సుదూర ప్రాంతాలకు వెళ్లి బతకాలని నిర్ణయించుకున్నామని నిందితులు వెల్లడిస్తున్నట్లు సమాచారం. దీనిపై ఒకటి, రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చడానికి పోలీసులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

టీ తాగడానికి వచ్చి..

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- ఎంజీఎం వద్ద ఘటన

ఎంజీఎం : టీ తాగడానికి వచ్చి.. ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి వరంగల్ ఎంజీఎం వద్ద చోటు చేసుకుంది. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి కథనం ప్రకారం.. హనుమకొండ మచిలీబజార్‌కు చెందిన ఎండి. రహబ్ అలీఖాన్(19) మిత్రులతో కలిసి ఎంజీఎం వద్ద టీ తాగడానికి వచ్చాడు. రాత్రి వేళలో వర్షం పడుతున్న క్రమంలో టీ డబ్బా వద్ద ఉన్న ఇనుప స్తంభానికి తాకగా విద్యుత్ సరఫరా అయ్యింది. గమనించిన మిత్రుడు షోయాబ్ ఖాన్.. రహబ్ అలీఖాన్‌ను కాపాడడానికి యత్నించగా అతడు కూడా ఎగిరి పడ్డాడు. అనంతరం రహబ్ అలీఖాన్‌ను ఎంజీఎం తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టీ షాపు యాజమాని అజీమ్ ఖాన్ నిర్లక్ష్యంతోనే తన కుమారుడు మృతి చెందాడని మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

వారాహి అవతారంలో పద్మాక్షిదేవి



వారాహి అవతారంలో పదాక్షి అమ్మవారు

హన్మకొండ అర్బన్: ఆషాఢమాసం (శాకంబరీ వారాహి) మహోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని పద్మాక్షి కాలనీలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షిదేవి వారాహి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని, నాగిళ్ళ శంకర్‌శర్మ ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి వారాహిమాతగా అలంకరించి మంత్రపుష్పం నామ సంకీర్తణ నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ సభ్యులు సదానందం, రాజ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి విరోధిని, వహ్నివాసిని క్రమాలలో పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో కొనసాగుతున్న శాకంబరీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా.. సోమవారం ఐదో రోజు అమ్మవారికి విరోధిని, వహ్నివాసినిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం అమ్మవారికి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం కాళీక్రమాన్ని అనుసరించి స్నపనబేరాన్ని విరోధిని క్రమంలో, షోడశీక్రమాన్ని అనుసరించి భోగబేరాన్ని వహ్నివాసిని క్రమంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. శ్రీమాతా, లలితాంబికా సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు హాజరై అమ్మవారికి చీర, సారె సమర్పించారు. మట్వాడ సీఐ గోపీ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ఈఓ శేషుభారతి, ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, నార్ల సుగుణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.